క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు

తిరువూరు: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గాంధీజీ జీవిత చరిత్రపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గాంధీ స్వాతంత్య్రోద్యమంలో చేసిన కృషిని నేటి తరానికి తెలియజేసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వేంకటాచలస్వామికి గరుడ సేవ



తిరువూరు: భాద్రపద శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం తిరువూరులో వేంచేసిన శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో గరుడ వాహన సేవ నిర్వహించారు. వేంకటాచలస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి భక్తులు ఊరేగింపు జరిపారు. స్వామికి అష్టోత్తర శతనామాలతో ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు విశేషపూజలు చేశారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



చాట్రాయి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండలంలోని చనుబండ సచివాలయం–1లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గమిడిమెల్లి శ్రీరాములు అనే సీనియర్ ఓటరును శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



మైలవరం: మైలవరంలో వినాయక చవితి సందర్భంగా వివిధ ఏరియాల్లో చలువ పందిళ్లలో 10 రోజులుగా పూజలందుకున్న గణనాథుల విగ్రహాలు ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలి వెళ్లాయి. బ్యాండ్ మేళం, డీజేలతో విగ్రహాలను భక్తులు తరలించారు. యువకులు డ్యాన్స్ చేస్తూ వేడుకలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి

మైలవరం: మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

సాకారం కానున్న వందేళ్లనాటి కల

- గ్రామానికి రెండు వైపులా రైల్వేగేట్లతో ఇబ్బందులు
- ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే పచ్చజెండా
- సర్వే నిర్వహించిన రైల్వే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు



కొండపల్లి రైల్వే గేటు వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైల్వే, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఈలప్రోలు గ్రామస్తులు వందేళ్లకు పైగా ఎదురు చూస్తున్న రోడ్డు అండర్ బ్రిడ్జి కల సాకారం కానుంది. గ్రామానికి రెండువైపులా ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లు సమస్యకు ప్రత్యామ్నాయంగా రైల్వేశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృషితో గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ సమీపంలో రోడ్డు అండ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), కొండపల్లి వద్ద రోడ్డు అండ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణానికి ముందుకొచ్చింది. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ వర్క్స్ ఇంజినీర్ శ్రీనివాస్ నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపాల్టీ, ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులు సర్వే నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా 22 మీటర్ల వెడల్పు, 150 మీటర్ల పొడవుతో రెండువైపులా భూమి అవసరం ఉంటుందని అంచనా వేశారు.

ఈలప్రోలు గ్రామ నేపథ్యం

160 ఎకరాల విస్తీర్ణం గల గోవిందప్ప చెరువు నీటిని ఆధారం చేసుకుని మూడు తరాల క్రితం ఈలయ్య, పోలయ్య అనే ఇద్దరు వ్యక్తులు నివాసం ఏర్పాటు చేసుకోవడంతో గ్రామం ఏర్పడిందని చెబుతారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే ఇక్కడి ప్రజల అవసరాలు, వ్యక్తిగత పనులు, విద్య వైద్య సేవలకు రెండు కిలోమీటర్ల దూరంలో కొండపల్లి, ఐదు కిలోమీటర్ల దూరం గల గుంటుపల్లి, రాయనపాడు మీదుగా విజయవాడ వెళ్తుంటారు. 107 ఏళ్ల క్రితం 1916లో కొండపల్లి రైల్వేస్టేషన్, రైల్వేలైన్ ఏర్పాటు కావడంతో కొండపల్లి వద్ద, రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ సమీపంలో రెండు రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లు పెట్టారు. రెండు రైల్వే గేట్లు గ్రామప్రజల రవాణాకు ఆటంకంగా మారాయి.

వందేళ్లుగా ఎదురు చూపులు

కొండపల్లి రైల్వేస్టేషన్ మీదుగా రోజుకు సుమారు 20 రైళ్ల వరకు రాకపోకలు సాగిస్తాయి. వీటితో పాటు ఎన్టీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తికి అవసరైన బొగ్గు రవాణాకు సుమారు 20 రైళ్లు రోజు వచ్చి మళ్లీ తిరిగి వెళ్తుంటాయి. దీంతో రైల్వేగేట్లు ఎక్కువ సమయం మూసిఉంటాయి. అత్యవసర సమయాల్లో వైద్య శాలలకు వెళ్లాలంటే గేట్లు అడ్డుగా ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో అనేకమంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఫ్లై ఓవర్ నిర్మాణానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు గతంలో చెప్పుకున్నా సాకారం కాలేదు. సినీనటులు సూపర్‌స్టార్ కృష్ణకు ఈ గ్రామంతో బంధుత్వం ఉంది. ఆయన ఏలూరు ఎంపీగా ఉన్న సమయంలో రైల్వేగేటు సమస్య ఆయన దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే వసంత ప్రత్యేక చొరవ

గ్రామ జనాభా సుమారు 2,600 మందితో పాటు నూతన జగనన్న కాలనీలో 1,600మందికి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మరో 360మందికి స్థలాలు కేటాయించారు. విజయవాడ పట్టణ పరిధిలో రెండు వేల మందికి అవసరమైన ప్రైవేట్ భూమి సేకరించారు. జగనన్న కాలనీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే ఆ ప్రాంత జనాభా సుమారు 10 వేలకు పైగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రజల సౌకర్యార్థం రైల్వే అధికారులకు పలుమార్లు లేఖలు రాశారు. గ్రామానికి రెండు వైపులా ఉన్న గేట్లు వద్ద ఆర్‌యూబీ, ఆర్ఓబీ నిర్మాణాలకు రైల్వేశాఖ ముందుకు వచ్చింది.

ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి



గ్రామానికి రెండువైపులా రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లు ఉన్నాయి. గ్రామస్తులు పడుతున్న బాధలు నా చిన్నతనం నుంచి కళ్లారా చూశాను. ఇప్పుడు ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం కావడంతో ప్రజల కష్టాలు తొలగిపోతాయి. ఇందులో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృషి మరువలేనిది.

– కరణం రంగారావు, గ్రామ సర్పంచ్, ఈలప్రోలు

'స్వచ్ఛతా హీ సేవ'లో భాగస్వాములు కావాలి



మైలవరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ



తిరువూరు ఏడో వార్డులో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



నూజివీడులో స్వచ్ఛతా హీ సేవపై మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ర్యాలీ

మైలవరం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న ఏక్ తారీక్, ఏక్ గంట, ఏక్ సాత్ అనే నినాదంతో రోజు ఉదయం 10 నుంచి ఒక గంట సేవ ప్రజలందరి భాగస్వామ్యంతో శ్రమదానం చేసి మన నివాస ప్రాంతం, పనిచేసే చోట పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు, కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, సర్పంచ్ గరికిపాటి మంజుభార్గవి, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, వైస్ ఎంపీపీ రహీం పాల్గొన్నారు.

- స్థానిక తారకరామానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ పుష్పలత, సూపర్‌వైజర్ గౌసియాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఎస్.రాము, జిల్లా ప్రోగ్రామ్ అధికారి బి.వినోద్ కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: పరిసరాల పరిశుభ్రత పౌరుల కనీస బాధ్యతని తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏడో వార్డులో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రపరచారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై స్థానికులకు అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్ల వెంబడి మొక్కలు నాటారు. మండలంలోని మునుకుళ్లలో జరిగిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ వెంకటకృష్ణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెదురు గోపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

- మల్లేలలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కలకొండ రవికుమార్, సర్పంచ్ మరియమ్మ, ఉపసర్పంచి సువర్చల, ఆంజనేయపురంలో సర్పంచ్ మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, వావిలాలలో ఎంపీటీసీ సభ్యురాలు కంచిపోగు లక్ష్మి, ఈఓపీఆర్డీ వెంకటరత్నం పాల్గొన్నారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో మేనేజరు సాంబశివమూర్తి, సిబ్బంది మొక్కలు నాటారు.

నూజివీడులో..

నూజివీడు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో పది ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొని ట్రిపుల్ ఐటీ ఆవరణను ఆదివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో..

నూజివీడు రూరల్ పోలీసులు పోలీసుస్టేషన్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో..

నూజివీడు పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి, అనంతరం రోడ్లను, మున్సిపల్ కార్యాలయ ఆవరణను శుభ్రపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా స్వచ్ఛతా హీ సేవ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం, పవిత్రసంగమం, కొండపల్లి, గుంటుపల్లి గ్రామ పంచాయతీ, రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు, కేంద్రీయ విద్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత నిరంతరం కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, బాడిశ నాగరాజ కుమారి, నల్లమోతు లక్ష్మీ, టౌన్ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, లంకే అంకమోహనరావు పార్టీ నాయకులు, వాలంటీర్లుతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి మునేశ్వర రావు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎంఎస్ఎస్ కృష్ణ, రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఓసీఎల్ ఆధ్వర్యంలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎల్‌పీజీ ప్లాంట్ ఆధ్వర్యంలో కొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు తొలగించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.



ఇబ్రహీంపట్నంలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు



చాట్రాయి మండలం జనార్దనవరంలో రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సంస్థ చీఫ్ మేనేజర్ రామారావు, సీనియర్ మేనేజర్ డేవిడ్ అరోరా పాల్గొన్నారు.

చెవుటూరులో శ్రమదానం

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. గ్రామంలో రహదారుల వెంబడి ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని అన్ని వీధుల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నెక్కలం గొల్లగూడెంలో..

నూజివీడు (ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సర్పంచ్ లింగవరపు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు పాల్గొని గ్రామంలోని ప్రధాన సెంటర్‌లోని రహదారులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాస్, గ్రేడ్–5 సెక్రటరీ నాగేంద్రం పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సూచనలు అవసరం



కొండపల్లిలో వృద్ధులను సత్కరించిన కమిషనర్ వెంకటేశ్వర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీనియర్ సిటిజన్స్ సూచనలు నేటి సమాజానికి అవసరమని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులకు కేటాయించిన పలు పథకాలు వారికి అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాల్టీ ఇంజినీర్ సాయిగణేష్ పాల్గొన్నారు.

వాహనమిత్ర విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న డ్రైవర్లకు ధన్యవాదాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ వాహన మిత్రల విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు గ్రామ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన కృతజ్ఞతాపూర్వక ర్యాలీలో పాల్గొనటం ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. డ్రైవరన్నలకు ధన్యవాదాలు తెలిపిన వారిలో వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, నాయకులు ధూళిపాళ శ్రీకాంత్, జాస్తి జగన్, గేరా సుమన్ కుమార్, ఎంపీటీసీలు ధనేకుల చౌదరి, కేతుపల్లి దావీదు, పైలా ఆదినారాయణ, చిట్టినేని శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ తదితరులు ఉన్నారు.

వినాయకుని నిమజ్జనంలో వివాదం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు గ్రామంలో వినాయకుని నిమజ్జన వేడుకల్లో ఇరువర్గాల మధ్య వివాదం చేటుచేసుకుంది. మాటా మాటా పెరిగి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాల వారిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మాంసం, చేపలు మార్కెట్‌లకు విక్రయాలు బంద్ ప్రకటించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కబేళా కూడా మూసేస్తామని, ఎవరైనా నిబంధనలను పాటించకుండా షాపులు తీసి వ్యాపారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణం



అస్మదీయం, అనంత ఆకాశంలో కవితా సంపుటిలను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: కవి జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణంగా భావించవచ్చని జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు పెద్దిటి యోహాన్ అన్నారు. పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా 128 జయంతి వేడుకలు, కవి సమ్మేళనం, గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యోహాన్ మాట్లాడుతూ జాషువా కవిత్వం వేదనాభరితమై సందేశాత్మకంగా సాగుతుందన్నారు. కళాపరిషత్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గద్దం విజయరావు మాట్లాడుతూ జాషువా కవిత్వానికి ఎల్లలు లేవని తెలిపారు. కవయిత్రి డాక్టర్ సాంబేలు శాంతిబాయ్ మాట్లాడుతూ నేటి యువ కవులు ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. సంపాదకుడు కలిమిశ్రీ, కవులు సిరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, డాక్టర్ రంగిశెట్టి రమేష్ ప్రసంగించారు. అస్మతున్నీసా రచించిన అస్మదీయం, అనంత ఆకాశం, దాసరి ఆదినారాయణ రచించిన అనంత ఎర్ర సితార కవితా సంపుటాలను ఆవిష్కరించారు. దాసన్నగారి కృష్ణమూర్తి, డాక్టర్ సాంబేలు శాంతిబాయ్‌లకు జాషువా విశిష్ట పురస్కారాలను, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులకు జాషువా పురస్కారాలను అందించారు. కవులు స్వీయకవితాగానం చేశారు.

నవరస నటుడు అక్కినేని



విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని స్వరలయ సంగీత సంస్థ నిర్వాహకుడు ఆర్.ప్రభాకర్ అన్నారు. స్వరలయ సంస్థ ఆదివారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని స్వయం ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నందుకే అత్యున్నతమైన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం లభించినట్లు తెలిపారు. గాయనీ గాయకులు బాల పృధ్వీరాజ్, రాజ్, రేవతి, భారతి, నాగమణి, వైఎస్ రామకృష్ణ.. అక్కినేని నటించిన 40 చిత్రాల్లోని పాటలు ఆలపించారు. నిర్వాహకులు అక్కినేని చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఉషారాణి అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌లోని శిబిరంలో ఎంఎన్ఓలు, సెక్యూరిటీ సిబ్బంది 23 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. మనం చేసే రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు నిలుపుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరంజిత, డీపీఎం కిరణ్, కౌన్సిలర్ జోస్పిన్ పాల్గొన్నారు